

30న ఐటిడిఎ పాలకమండలి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

కోటరామచంద్రాపురం ఐటిడిఎ గవర్నింగ్‌బాడీ సమావేశం ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రపురంలోని ఐటిడిఎలో నిర్వహిస్తామని ఐటిడిఎ ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ ఎం.సూర్యతేజ తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలని కోరారు.



అరకొర రుణాలు..!



- కౌలురైతులను పట్టించుకోని వైసిపి ప్రభుత్వం
- రెండు జిల్లాల్లో లక్షా 20 వేలు కౌలుకార్డులు జారీ
- బ్యాంకుల నుంచి నామమాత్రంగా పంట రుణాలు
- ఖరీఫ్‌ సీజన్‌లో రూ.ఆరు కోట్లే ఇచ్చినట్లు సమాచారం
- వాస్తవ సాగుదారుడైన కౌలురైతుల పరిస్థితి దారుణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలురైతుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. జిల్లా వ్యవసాయసాగులో దాదాపు 75 శాతం భూమిని సాగు చేస్తున్న వాస్తవ సాగుదారుడైన కౌలురైతులను చిదిమేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం రోజున మంత్రుల సందేశంలోనూ కౌలురైతుల ప్రస్తావన లేకుండాపోవడం గమనార్హం. రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో వీరిదే కీలక పాత్ర. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. 2019లో ప్రభుత్వం కౌలురైతుల చట్టంలో మార్పులు చేసి భూయజమానులకు అండగా నిలిచింది. భూయజమాని అంగీకారం లేకుండా కౌలురైతులకు రుణార్హత కార్డులు జారీ చేసేందుకు వీల్లేదన్న నిబంధన తీసుకొచ్చింది. దీంతో కౌలురైతులకు కౌలుకార్డులు జారీచేయడం సైతం గగనంగా మారింది. ఏలూరు జిల్లాలో 57 వేలు, పశ్చిమలో 60 వేల వరకూ కౌలుకార్డులు చేశారు. కార్డులిచ్చిన వారికైనా రుణాలిచ్చారా అంటే అదీ లేకుండాపోయింది. ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకూ పశ్చిమలో దాదాపు రూ.మూడు కోట్లు, ఏలూరు జిల్లాలోనూ అదేస్థాయిలో కౌలురైతులకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. సాగు చేయని భూయజమానికి పంటరుణాలు మంజూరు చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. కార్డులు జారీ చేసిన రైతులకూ బ్యాంకులు రుణాలివ్వడం లేదు. అదే సర్వే నెంబర్‌ భూమిపై భూయజమాని రుణం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖరీఫ్‌ పెట్టుబడుల కోసం కౌలురైతులు నానావస్థలు పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేస్తున్న పరిస్థితి నెలకొంది. పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతింటే పరిహారం, రైతుభరోసా ప్రభుత్వం అందిస్తున్న ఏ సాయమూ కౌలురైతులకు అందని దుస్థితి ఉంది. దీంతో కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కౌలురైతుల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందనే చర్చ రైతుల్లో నడుస్తోంది.

ఇ - క్రాప్‌ విధానం ఎందుకో..?

ప్రభుత్వం తెచ్చిన ఇ-క్రాప్‌ విధానం ఎందుకో తెలియని పరిస్థితి నెలకొంది. ఇ-క్రాప్‌ విధానంలో సాగు చేసిన ప్రతి భూమికీ సంబంధించిన వివరాలు అధికారులు ఆన్‌లైన్‌ చేయాలి. సాగు చేసిన భూమి వద్దకు వెళ్లి ఏ పంట వేశారో పరిశీలించి.. సాగు ఎవరు చేస్తున్నారో నిర్ధారించి ఆ పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అయితే ఎక్కడా అటువంటి ప్రక్రియ జరగడం లేదు. ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లు నమోదు చేయకుండా సాగు చేయని భూయజమాని పేరును నమోదు చేస్తున్నారు. దీంతో ధాన్యం విక్రయించే హక్కు కూడా కౌలురైతుకు లేకుండాపోయింది. వాస్తవ సాగుదారుడైన కౌలురైతును పక్కన పెట్టి సాగుకు దూరంగా ఉంటున్న భూయజమానికి లాభం చేకూర్చేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీంతో కౌలురైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలురైతులకు పంట రుణాలిచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సాగుదారులు కోరుతున్నారు. కౌలురైతులకు ఎన్ని రుణార్హత కార్డులిచ్చారు, ఎంతమేర రుణాలు మంజూరు చేశారనే వివరాలు సైతం చెప్పని పరిస్థితి నెలకొంది. కౌలురైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బట్టబయలవుతుందనే కారణంతోనే వివరాలు బయటికి చెప్పడం లేదనే చర్చ నడుస్తోంది.



మాట్లాడుతున్న కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌

బడికిరాని విద్యార్థులను బడిలో చేర్పించాలి

కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతి ఒక్కరికీ విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని జిల్లా కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మిషన్‌ గ్రాస్‌ ఎన్రోల్మెంట్‌ రేషియో(జిఇఆర్‌) జిల్లాస్థాయి సమీక్షా సమావేశం కలెక్టర్‌ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్‌ ప్రసన్నవెంకటేష్‌ మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలలు, జూనియర్‌ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2023-24 సంవత్సరానికిగాను విద్యార్థుల డ్రాప్‌వుట్స్‌ను గుర్తించే సర్వేలో ఎంఇఒ, ఎంపిడిఒ, స్కూలు ప్రధానోపాధ్యాయులు, వాలంటీర్లు, కళాశాల ప్రిన్సిపాళ్లతో డ్రాప్‌వుట్‌ విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా కలిసి విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. వారిని తిరిగి బడిలో చేర్పించేలా చూడాలని ఆదేశించారు. 19 కేటగిరిల్లో సర్వేలో చేపట్టిన అంశాలను సమీక్షించారు. కొన్ని మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు సంక్షిప్తంగా లేకపోవడంపై అధికారులపై కలెక్టర్‌ అసహనం వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదీకి స్పష్టమైన సమాచారంతో నివేదికను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఇంటర్‌లో చేరకపోవడానికి కారణాలను కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. దీనిని అధిగమించడానికి చర్యలు చేపట్టి నూరుశాతం సర్వే పూర్తి చేయాలన్నారు. పాఠశాల, కళాశాల మానేసిన విద్యార్థులు, తల్లిదండ్రులను కలిసి విద్య ప్రాముఖ్యతను తెలిపి వారిని తిరిగి చేర్చే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ఆర్‌ఐఒ కె.చంద్రశేఖర్‌, డిఇఒ శ్యామ్‌సుందర్‌, డివిఇఒ బి.ప్రభాకర్‌, ఎంఇఒలు, జూనియర్‌ కళాశాలల పిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల 'స్పందన'కు 32 వినతులు

కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌

ప్రజాశక్తి - ఏలూరు

ఉద్యోగుల గ్రీవెన్స్‌ డే సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలపై అందజేసిన వినతులను జిల్లా కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేక ఎంప్లాయీస్‌ గ్రీవెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ, విఆర్‌ఒల సంఘం, సర్వే డిపార్ట్‌మెంట్‌ సంఘం, పలు ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. అలాగే పలువురు ఉద్యోగులు వ్యక్తిగత సమస్యలకు సంబంధించి వినతులను అందజేశారు. వీటిపై జిల్లా కలెక్టర్‌ స్పందిస్తూ నిబంధనల మేరకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న రెగ్యులర్‌, కాంట్రాక్ట్‌, అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులు తమ సర్వీసు సంబంధిత సమస్యలపై అందజేసిన వినతులను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తంగా 32 వినతులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ ఎవిఎన్‌ఎస్‌.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌జిఒ నేతలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి: ఎపి ఎన్‌జిఒ నేతల వినతి

ఏలూరు అర్బన్‌: ఉద్యోగుల గ్రీవెన్స్‌ డే సందర్భంగా జిల్లాలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎపి ఎన్‌జిఒ సంఘం నేతలు కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్‌ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని, ముఖ్యంగా ఉద్యోగినులు తాము పని చేస్తున్న కార్యాలయాల్లో టాయిలెట్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రతి సమస్యనూ స్వయంగా పరిశీలించి, వివరణాత్మకంగా విశదీకరించి పరిష్కారం చూపుతామని, ఉద్యోగులకు త్వరలోనే ప్రభుత్వ భూములు ఎక్కడైతే ఉన్నాయో వాటిని సాధ్యమైన సమయంలో కేటాయిస్తామని చెప్పారు. ఈ విషయంలో జాయింట్‌ కలెక్టర్‌ చొరవ తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యదర్శి నెరుసు రామారావు, శ్రీధర్‌రాజు, కె.సత్యనారాయణ, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే 88.41 శాతం పూర్తి : కలెక్టర్‌

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇంటింటికీ ఓటర్ల సర్వే కార్యక్రమం 88.41 శాతం పూర్తయ్యిందని జిల్లా కలెక్టర్‌ ప్రసన్నవెంకటేష్‌ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌ మీనాకు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం నుండి జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖేష్‌ కుమార్‌ మీనా మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలని, చనిపోయిన, ఇల్లు మారిన, వలస వెళ్లిన ఓటర్లకు సంబంధించి వారి చిరునామాకు నోటీసులు జారీ చేయాలని, ఎన్నికల కమిషన్‌ నిబంధనలు పాటించిన తర్వాతే జాబితా నుండి తొలగించాలన్నారు. అర్హులైన ఏ ఒక్కరినీ జాబితా నుండి తొలగించవద్దని, ఒకే ఇంటి నెంబర్‌తో ఎక్కువ ఓటర్లు నమోదైన అంశంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ఇంటింటికీ ఓటర్ల సర్వే కార్యక్రమం తీరుతెన్నులు వివరించారు. జిల్లాలో ఆరు లక్షల 65 వేల 932 ఇళ్లకు సంబంధించి ఓటర్ల జాబితా సర్వే చేయాల్సి ఉండగా ఇంతవరకు ఐదు లక్షల 88 వేల 765 ఇళ్లను సర్వే చేశామని, మిగిలిన సర్వేను మూడు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. వీటిలో డూప్లికేట్‌ ఓటర్లు 1328, ఇల్లు మారినవారు 2928, మరణించిన ఓటర్లు 8858గా గుర్తించామని చెప్పారు. వంద సంవత్సరాలు వయస్సు దాటిన 140 మంది ఓటర్లను గుర్తించామన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ ఎవిఎన్‌ఎస్‌.మూర్తి, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్‌, ఆర్‌డిఒ కె.పెంచల్‌కిషోర్‌, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఎస్‌డిసిలు సత్యనారాయణ, సూర్యనారాయణరెడ్డి, కలెక్టరేట్‌ కార్యాలయ సూపరింటెండెంట్‌ చల్లన్నదొర, తహశీల్దార్‌ సోమశేఖర్‌ పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రితో బయల్దేరిన సిబ్బంది

నేడు పంచాయతీ పోరుకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రులో శనివారం జరగనున్న గ్రామ సర్పంచి ఉప ఎన్నికకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్‌ ఉదయం ఏడు గంటలకు మొదలై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగియనుంది. తదుపరి 2 గంటల నుంచి పోలైన ఓట్లను అధికారులు లెక్కింపు చేపడతారు. వణుదుర్రులో మొత్తం 1613 మంది ఓటర్లు ఉన్నారు. వీరికోసం నాలుగు పోలింగ్‌ బూత్‌లను ఏర్పాటు చేశారు. వణుదుర్రులో రెండు, శివారు గ్రామమైన కొత్తపల్లిలో రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్‌ సందర్భంగా గ్రామంలో ఎలువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా 35 మంది పోలీసలు ,ఇద్దరు ఎస్‌ఐలు, ఒక సిఐ బందోబస్తు నిర్వహించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ముదినేపల్లి మండల పరిషత్‌ కార్యాలయం నుంచి ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది ఎన్నికల సామగ్రితో ప్రత్యేక బస్సులో వణుదుర్రు తరలివెళ్లారు. ఈ ఉప ఎన్నికలో సర్పంచి అభ్యర్థులుగా చిన్నం సుగుణబాబు, చిన్నం వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు, కోనాలి రేవతి బరిలో ఉన్నారు.

ఉంగుటూరు: మండలంలోని కాకర్లమూడి పంచాయతీ 1, 5 వార్డులకు ఉప ఎన్నికలు ఈ నెల 19న జరగనున్నాయి. ఇక్కడి వార్డు సభ్యులు రాజీనామాలు చేయడంతో ఖాళీలు ఏర్పడగా ఎన్నికలు అనివార్యమయ్యాయి. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి మద్దతుదారులు పోటీలో నిలిచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ముసునూరు: పంచాయతీ ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లూ చేశామని ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముసునూరులోని 11వ వార్డు, కాట్రేనిపాడులోని 10వ వార్డుకు ఎన్నిక జరగనుందని చెప్పారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో ఎనిమిదో వార్డు ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. స్థానిక ఎంపీయుపి స్కూల్‌లో ఎనిమిదో వార్డుకు సంబంధించిన పోలింగ్‌ శనివారం ఉదయం శనివారం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. మద్యం దుకాణాలను మూసివేశారు. ఈ ఉప ఉపఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీపడుతున్నారు.

జిఒ 107, 108 రద్దు కోరుతూ పిడిఎస్‌యు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్‌

పేద విద్యార్థులకు మెడికల్‌ విద్యను దూరం చేసే 107, 108 జిఒలను రద్దు చేయాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో స్థానిక ఫైర్‌స్టేషన్‌ సెంటర్లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ అన్ని మెడికల్‌ కళాశాలల్లో వంద శాతం సీట్లు కన్వీనర్‌ కోటాలో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, నగర ప్రధాన కార్యదర్శి ఎం.జానకిరామ్‌, నేతలు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించాలి

డిఎంహెచ్‌ఒ ఆశా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్‌

డెంగీ జ్వరాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని, అప్పుడే ఆ జ్వరాలను అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.ఆశా సూచించారు. స్థానిక అర్బన్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గజ్జలవారి చెరువు, తోటకూరదొడ్డి సచివాలయ పరిధిలో ఫ్రైడే-డ్రై డే కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.ఆశా మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. డెంగీ కారక ఎడిష్‌ దోమ ఇంటి లోపల, బయట ఉండే నీటి నిల్వ ప్రాంతాలైన ఎయిర్‌ కూలర్స్‌, రుబ్బురోలు, ఫ్రిజ్‌ వెనుక బాక్స్‌, గ్రైండర్స్‌, మూతల్లేని నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, ఫ్లవర్‌ వాజులు, పూల కుండీలు, పగిలిపోయిన ప్లాస్టిక్‌ వస్తువులు, టైర్లు, వాడేసిన కొబ్బరి బొండాల్లోనూ పెరుగుతాయని వివరించారు. వారానికోసారి నీటి తొట్టెలు క్లీన్‌ చేసుకుని మూతలు పెట్టుకోవాలని, పనికిరాని వస్తువులను పడేయాలని సూచించారు. నీటి నిల్వ ప్రాంతాలను మట్టితో చదును చేయాలని, డెంగీ దోమ పగటిపూట కుడుతుందని, కావున ఫుల్‌హ్యాండ్‌ డ్రెస్‌లు వాడాలని, డెంగీ జ్వరాల పట్ల అశ్రద్ధ చేయరాదని సూచించారు. ఆలస్యం చేస్తే ప్లేట్‌లెట్స్‌ కౌంట్‌ బాగా పడిపోయి డెంగీ షాక్‌ సిండ్రోమ్‌కు గురై ప్రాణాపాయ స్థితికి వెళ్లే అవకాశం ఉందని హెచ్చరించారు. డెంగీకి సంబంధించిన పరీక్షలు ప్రతి పిహెచ్‌సిలోనూ, హెల్త్‌ అండ్‌ వెల్‌నెస్‌ సెంటర్లలోనూ ఉచితంగా చేస్తారని తెలిపారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్బన్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్‌ బాలకృష్ణ, అసిస్టెంట్‌ మలేరియా ఆఫీసర్‌ జె.గోవిందరావు, బసవరాజు, ఎంపిహెచ్‌ఇఒ రవికుమార్‌, హెల్త్‌ అసిస్టెంట్స్‌ శ్రీనివాసరావు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ ఆశా

ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన

ఖరీఫ్‌ ధాన్యం సేకరణకు ముందస్తు చర్యలపై జెసి లావణ్యవేణి సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమైనందున ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జాయింట్‌ కలెక్టర్‌ బి.లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా ధాన్యం కొనుగోళ్ల కమిటీ సమావేశం (డిపిసి) జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోలు చేస్తామని తెలిపారు. ధాన్యం సేకరణలో సంబంధిత అధికారులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతులకు గ్రామసభల ద్వారా ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై రైతులకు చెల్లించే గోనె సంచుల వినియోగ రుసుం (సంచికి రూ.3.9 పైసలు) హమాలీల ఖర్చు, ధాన్యం సరఫరా రవాణా ఖర్చుపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గత ఖరీఫ్‌, రబీలో ధాన్యం కొనుగోళ్లు బాగా జరిగాయన్నారు. గత లోపాలను సమీక్షించుకుని ఈసారి మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌లో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని, సుమారు 6.80 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని అంచనా వేశామని తెలిపారు. దీనికి తగిన విధంగా గోనెసంచులు, రవాణా వాహనాలు, హమాలీలు, సాంకేతిక సిబ్బంది శిక్షణ, ధాన్యం సేకరణ కేంద్రాలు, సామగ్రి తదితర అంశాలపై అన్ని విభాగాల మధ్య సమన్వయం, సహకారం ఉండాలన్నారు. సమావేశంలో ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్‌, సివిల్‌ సప్లయిస్‌ జిల్లా మేనేజర్‌ మంజుభార్గవి, డిఎస్‌ఒ ఆర్‌ఎస్‌ఎస్‌.రాజు, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, ఉప రవాణా కమీషనర్‌ ఎస్‌.శాంతకుమారి, జిల్లా రైస్‌మిలర్ల అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌ చౌదరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి కృషి

ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్‌

హోంగార్డుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్‌ కార్యాలయ సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా హోంగార్డు యూనిట్‌లో పని చేస్తూ గత ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు 309 కె.హరిబాబుకు పోలీసు శాఖ నుంచి రావాల్సిన రూ.5,44,570 చెక్కును హోంగార్డ్‌ సంక్షేమ నిధి నుండి ఎస్‌పి మేరీ ప్రశాంతి శుక్రవారం హరిబాబుకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ హరిబాబు పోలీసులతో సమానంగా విధులు నిర్వహించారని ప్రశంసించారు. ఏమైనా సమస్యలుంటే తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌ ఆర్‌ఐ పవన్‌ కుమార్‌, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

బోస్‌ దేశభక్తి చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఏలూరు

సుభాష్‌ చంద్రబోస్‌ ప్రదర్శించిన దేశభక్తి చిరస్మరణీయమని, దీన్ని అందరూ పెంపొందించుకోవాలని ఎవిఆర్‌ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. స్వాతంత్ర సమర యోధుడు సుభాష్‌ చంద్రబోస్‌ 78వ వర్ధంతి సందర్భంగా పవరుపేటలోని అన్నే భవనంలో సుభాష్‌ చంద్రబోస్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా వచ్చిన స్వాతంత్రం మనందరికీ సంపూర్ణంగా దక్కాలన్నారు. దేశం కోసం పోరుబాట పట్టిన మహనీయుడని కొనియాడారు. ఇండియన్‌ నేషనల్‌ ఆర్మీ (ఆజాద్‌ హింద్‌ ఫౌజ్‌) నెలకొల్పి సైనికంగా పోరు సాగించాడన్నారు. అన్ని మతాలు, ప్రాంతాల సైనికులను ఐక్యం చేసేందుకు సుభాష్‌ చంద్రబోస్‌ ఇచ్చిన జైహింద్‌ నినాదం గొప్ప ప్రేరణ కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మి, బి.త్రినాధ్‌, ఎన్‌.సురేష్‌, జి.సుకుమార్‌, కె.గౌతమ్‌, ఎస్‌.నవదుర్గ, పి.నీలిమ, వై.సరోజ, వివిధ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.



బోస్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

బస్సు యాత్రను జయప్రదం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్‌

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ రాష్ట్ర సమితి తలపెట్టిన ప్రచార బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్‌, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి నినాదంతో ఈ నెల 17న విశాఖలో ప్రారంభమైన బస్సు యాత్ర 23న ఏలూరు జిల్లాలో ప్రవేశిస్తుందని, ఆ రోజు ఉదయం 11 గంటలకు ఏలూరు టుబాకో కళ్యాణ మండపంలో పోలవరం సమస్యపై రౌండ్‌టేబుల్‌ సమావేశం, సాయంత్రం నాలుగు గంటలకు జంగారెడ్డిగూడెంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై బహిరంగ సభ, 24న ఉదయం 10 గంటలకు నూజివీడులో భూసమస్యలపై సదస్సు ఈ యాత్ర సందర్భంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, కె.కృష్ణమాచార్యులు, రెడ్డి శ్రీనివాస్‌ డాంగే, కడుపు కన్నయ్య, గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు, కనకం జగన్‌ పాల్గొన్నారు.

జర్నలిస్టు సూర్యప్రసాద్ మృతి

ప్రజాశక్తి - ఏలూరు



సూర్య (ఫైల్ ఫొటో)

జర్నలిస్టు మీసాల సూర్యశివప్రసాద్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సూర్యప్రసాద్ గత కొంతకాలంగా లివర్‌కు సంబంధించిన అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఇటీవల బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. దీంతో తలకు దెబ్బ తగిలి అనారోగ్య పాలయ్యారు. కొన్ని రోజులుగా ఇంటివద్దనే ఉంటూ వైద్యం చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో రెండువారాల క్రితం విజయనగరంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అనార్యోగం మళ్లీ తిరగబడడంతో కుటుంబసభ్యులు విశాఖపట్నంలోని ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. సూర్యప్రసాద్ ఈనాడు, ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, అమరావతి వంటి పత్రికల్లో ఏలూరు కేంద్రంగా విలేకరిగా పనిచేశారు. సూర్యప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ ఏలూరు నియోజకవర్గ అధ్యక్షులుగా సూర్య ప్రసాద్ ఉన్నారు. సూర్యప్రసాద్ అకాల మరణం పట్ల ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతలు, పలువురు పాత్రికేయులు సంతాపం తెలిపి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టెండర్లకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సంబంధించిన స్టేషనరీ, సర్జికల్స్, లాబొరేటరీ, ఆర్థో ఇంప్లాంట్స్(ఎమర్జెన్సీ లోకల్ కొనుగోలు) సరఫరా చేయుటకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ యం.శశిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 సెప్టెంబరు 1 నుంచి 2025 ఆగస్టు 31 వరకూ గల కాలమునకు సంబంధించి టెండర్ ఫారములు ఈనెల 23వ తేదీ వరకూ ఆసుపత్రి కార్యాలయంలో లభించునన్నారు. కార్యాలయం పని వేళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వెయ్యి రూపాయలు చెల్లించి టెండర్ ఫారమును పొందవచ్చున్నారు. ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకూ సీల్డ్ టెండర్లు స్వీకరించబడునన్నారు, సాయంత్రం 4 గంటలకు టెండర్లు తెరవబడునని తెలిపారు. ఇతర సమాచారం నిమిత్తం కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలియజేశారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నేరాల అదుపునకు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నేరాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రతిఒక్కరూ సహకారం అందించాలని, అందులో భాగంగానే ఆటో డ్రైవర్ల సహకారంతో ఆకతాయిల ఆటకట్టించే విధంగా చర్యలు చేపడుతున్నామని ఏలూరు మూడో పట్టణ సిఐ శివాజీ తెలిపారు. ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో కళాశాల సమీపంలో విద్యార్థులను తరలించే ఆటో డ్రైవర్లతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐ శివాజీ ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఏలూరు నగరంలో కళాశాలల సమీపంలో ఆకతాయిలు విద్యార్థులను ఏడిపించే ప్రక్రియకు చరమగీతం పాడేందుకు ఆటో డ్రైవర్లతో ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలల సమీపంలో విద్యార్థులను ఆటో డ్రైవర్లు తరలించే సమయంలో ఎవరైనా ఆకతాయిలు వారిని వేధింపులకు గురి చేస్తే వెంటనే మూడో పట్టణ సిఐ ఫోన్ నెంబర్‌కు గాని, డయల్ 100కు గాని తెలియజేయాలని సూచించారు. ఎక్కడబడితే అక్కడ ఆటలను నిలుపుదల చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని కూడా ఆయన వారికి సూచించారు. ఆటోలలో విద్యార్థులను స్కూలుకు తీసుకొచ్చే సమయంలో, స్కూల్ నుంచి ఇంటికి తీసుకెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలను తీసుకుంటూ సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని తెలియజేసారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లంఘించిన యెడల వారిపై ట్రాఫిక్ నియమ నిబంధనల ప్రకారం, చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని ఆయన వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మూడో పట్టణ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భర్త, అత్తమామలే నిందితులు

మహిళ ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని బాపూనగర్‌లో ఈనెల 15వ తేదీన గుణదల శిరీష(31) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు శిరీష భర్త వెంకటేశ్వరరావును, అతడి కుటుంబ సభ్యులను నిందితులుగా గుర్తించారు. ఈ మేరకు మృతురాలి భర్త వెంకటేశ్వరరావు, అత్తమామలను నూజివీడు పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం గ్రామంలో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పిడిఎస్ అధికారులు పట్టుకున్నారు. విస్సన్నపేట నుంచి రాజమండ్రికి 17 టన్నుల అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రామకృష్ణ, పిడిఎస్ డిటిజి వెంకటేశ్వరరావు బృందం వెంబడించి సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడికి చెందిన గౌర వెంకటేశ్వరావు తన బార్యతో కలసి ఈనెల 13న ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వెళ్లి, మరలా తిరిగి టి.నరసాపురం మీదుగా చింతలపూడి వెళుతున్న క్రమంలో రాత్రి 7.30కి మండలంలోని శ్రీరామవరంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకోట్టారు. దీంతో వెంకటేశ్వరావుకు కాలు విరిగి, అతని భార్యకు గాయాలయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి

ఏలూరు స్పోర్ట్స్ :వ్యక్తిగత విభేదాలతో సొంత బంధువుపై బంధువులు దాడి చేసిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఓ మహిళపై ఆమె బంధువులే విచక్షణా రహితంగా దాడి చేశారు. ప్రస్తుతం బాధితురాలు ఏలూరు ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగంలో చికిత్సపొందుతుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు మండలం పోణంగి డంపింగ్ యార్డు సమీపంలో నివాసముంటున్న ఊటకూరి స్వామి, తులసి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. తులసి తన తల్లిదండ్రులకు చెందిన రేకులు షెడ్డులో కుటుంబంతో నివాసముంటున్నారు. ఇదిలా ఉండగా వారి బంధువులైన పోణంగి వైఎస్ఆర్ కాలనీకి చెందిన కొంతమందితో వీరికి విభేధాలున్నాయి. ఈ క్రమంలోనే నాలుగు రోజుల క్రితం బాధితురాలి మరిది నాని, ఆడపడుచు రమణ, వారి పక్షానికి చెందిన శివయ్య, నాగులు తులసిపై దాడి చేశారు. కత్తితో చేతుల మీద, ఛాతీపై నరికారు. దీంతో స్థానికులు ఆమెను ఆసుపత్రిలో చేర్చగా చికిత్సనందించారు. కోలుకున్న అనంతరం ఈనెల 18 రాత్రి ఆమెను ఇంటికి పంపారు. మళ్లీ శుక్రవారం తిరిగి దాడి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రతిఒక్కరూ బీమా కలిగి ఉండాలి

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్‌సి కాలనీవాసులకు అవగాహన

ప్రజాశక్తి - మండవల్లి



బీమాపై అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు

బీమా వల్ల కుటుంబానికి భరోసా కలుగుతుందని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు తెలిపారు. మండల కేంద్రమైన మండవల్లి ఎస్‌సి కాలనీలోని ప్రజలకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బీమా పథకాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బీమా కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రమాదం సంభవిస్తే ఆ బీమా ఎంతో మేలు చేస్తుందన్నారు. బ్యాంకు ఖాతాలో రూ.20 ఉంటే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు అర్హులని రూ.2 లక్షల బీమాను పొందవచ్చునని, అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష బీమా అందుతుందని తెలిపారు. 2017లో కేంద్ర ప్రభుత్వం మూడు రకాల సామాజిక భద్రతా పథకాలను తీసుకువచ్చిందన్నారు. 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల మధ్య ఉన్న వయస్కులు ఎవరైనా ఈ పథకాలలో చేరవచ్చని తెలిపారు. ప్రజలకు అవగాహన లేక ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. ప్రజలకు అవగాహన కలిగేలా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గ్రామగ్రామాన అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఈ పథకాలలో చేరి ప్రమాద ఆపద సమయాలలో లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు, వెలగపల్లి బేబీ సరోజిని, పి.విజయ, బి.తులసి, కె.లక్ష్మి, బి.జ్యోతి, ఎం.మరియమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్‌ను అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల కెనరా బ్యాంక్‌లో కెనరా బ్యాంకు విద్యాజ్యోతి పథకం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎస్‌సి, ఎస్‌టి బాలికలను ప్రోత్సహిస్తూ ప్రోత్సాహకాలను అందజేశారు. ప్రథమ స్థానము పొందిన ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2వేల ఐదువందలు, ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున గూటాల కెనరా బ్యాంక్ మేనేజర్ పి.పవన్ కుమార్ అందజేశారు. పాత పట్టిసీమ స్పెషల్ పాఠశాలలో చదువుతున్న ఐదవ తరగతి విద్యార్థినికి రూ.2వేల ఐదువందలు అందజేశారు. ఆరవవ తరగతి విద్యార్థిని మర్రి అంజలి, ఏడవవ తరగతి విద్యార్థిని పి.హారిక, ఎనిమిదవ తరగతి విద్యార్థిని డి.సంజన, తొమ్మిదవ తరగతి విద్యార్థిని పి.ప్రజ్ఞ, పదవ తరగతి కె.అలేఖ్యలను పాఠశాల హెచ్ఎం కెవి రాఘవన్, ఉపాధ్యాయుడు రత్నాజీ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

దూర విద్య సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(దూర విద్యా విధానం) ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని భీమడోలు రత్నా డిగ్రీ కళాశాలకు చెందిన సమన్వయకర్త బోయిన అమరనాథ్ కోరారు. స్థానిక కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన కళాశాల ఇన్‌ఛార్జి పి.బాలు, అధ్యాపకులు నాగూర్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం కళాశాలలో దూర విద్యా విధానం ద్వారా పదవ తరగతి, ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే వాటిలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయన్నారు. చదువు కొనసాగింపుపై ఆసక్తిగల వివిధ తరగతులు, వర్గాలకు చెందిన పలువురు తరగతుల్లో చేరాలని ఆయన కోరారు. తరగతులను వారికి ఇబ్బందిలేని విధంగా సెలవు దినాల్లో నిర్వహిస్తామని తెలియజేశారు.

182వ రోజుకు 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని సీతప్పగూడెం సచివాలయం పరిధిలో శుక్రవారం రాచురు, కుమ్మరికుంట, లంకాలపల్లి, కాపవరంలలో 182వ రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. జగనన్న అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా తెలుకొని పథకాలు వస్తున్న వారికి వాటి గురించి వివరించారు. పథకాలు రాని వారికి వెంటనే వచ్చేలా చేయాలని అధికారులను కోరారు. గ్రామంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో ఎంఎల్‌ఎకి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బుట్టాయగూడెం మండలం కాపవరం సమీపంలో రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన సీతప్పగూడెం నూతన సచివాలయాన్ని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జడ్‌పిటిసి మొడియం రామతులసి, మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, వైస్ ఎంపిపి గుగ్గులోతు మోహన్ రావు, సొసైటీ అధ్యక్షులు అరేటి సత్యనారాయణ, స్థానిక సర్పంచి పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న కన్వీనర్ భూక్యా వేణుగోపాల్

మండలంలోని గండిగూడెంలోని ఎంపీపీ పాఠశాలలో భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ కన్వీనర్ భూక్యా వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఒకటి నుంచి 8వ తరగతి వరకూ చదువుతున్న 140 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు, పెన్నులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ భుక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ద్వారా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యా కమిటీ ఛైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచబంటు వేములయ్య, కొరివి రమేష్, భూక్యా శ్రీనివాస్, దొద్దుల రాంబాబు, ఆలా వెంకట్, చేను వెంకన్న, చింతం నరసింహారావు, విద్యా కమిటీ ఛైర్మన్ కోట నాగు, ఆలా బాబురావు, పేరుబోయిన దుర్గయ్య, ఉపాధ్యాయులు భూక్యా కుమారి, అరుణ, వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పిహెచ్‌సి సేవలను వినియోగించుకోండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కళ్యాణ మహేశ్వరి

ప్రజాశక్తి - భీమడోలు

పిహెచ్‌సి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ పథకపు సేవలను వినియోగించుకోవాలని పూళ్ళ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కళ్యాణ మహేశ్వరి కోరారు. భీమడోలులో గురువారం పర్యటించిన పిహెచ్‌సి వైద్యులు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలకు చెందిన పిల్లలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఆ తర్వాత ఇంటింటికీ వెళ్లి గర్భిణీలు, బాలింతలతో పాటు ఇటీవల కాలంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందిన రోగులను పరీక్షించారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 14 మంది గర్భిణీలు, ఒక బాలింత, షుగర్, బిపి, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్న 115 మంది రోగులను పరీక్షించారు. సాధారణ జ్వరాలతో ఇబ్బందిపడుతున్న ఆరుగురికి చికిత్స చేసి మందులను పంపిణీ చేశారు. ఇదేక్రమంలో భీమడోలుకు చెందిన హెల్త్ క్లీనిక్ నెంబర్-1 ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒ కిషోర్, హెల్త్ క్లీనిక్ సిబ్బంది మురళి, చంద్రకళ పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



తహశీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

మండలంలోని పి.అంకంపాలెం పంచాయతీలోని పి.నారాయణపురం రెవెన్యూ పరిధిలో ఉన్న 200 ఎకరాల భూమిలో నిర్వాసితులకు, స్థానిక గిరిజనుల మధ్య జరుగుతున్న భూవివాదం రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోవడంతో రెండు వర్గాల మధ్య వివాదం జరుగుతూనే ఉంది. తాజాగా భూమిలోకి స్థానిక గిరిజనులు కొంతమంది ప్రవేశించి భూములు దున్నుతుండగా తమ పొలాలు దున్నుతున్నారని కొంతమంది నిర్వాసితులు వారి ట్రాక్టర్లను అడ్డుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక గిరిజనులు కూడా తమ సాగులో ఉన్న భూమిలో వ్యవసాయ పనులు చేసుకోవడానికి వెళ్లగా నిర్వాసితులు వారిని అడ్డుకొని నిర్బంధించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీసు వారిని వివరణ కోరగా రెండు ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. అదేవిధంగా భూ సమస్యను పరిష్కరించాలని గిరిజన నాయకులు మడకం వెంకటేశ్వరవు, అతని అనుచరులు తహశీల్దార్ కార్యాలయంలో కొద్ది సేపు ఆందోళన చేయగా తహశీల్దార్ వారితో మాట్లాడి సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని, అప్పటి వరకూ ఆ భూమిలోకి వెళ్లవద్దని వారికి వివరించి పంపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, రికార్డ్ వెరిఫికేషన్ చేసి, భూ సమస్యను త్వరితగతిన పూర్తి చేయాలని, లేకపోతే మళ్లీ వివాదాలు జరుగుతూనే ఉంటాయని పలువురు కోరుతున్నారు.

పెన్షన్ మంజూరు చేయాలని వినతి



డిఆర్‌కి మెమోరండం అందజేస్తున్న నాయి బ్రాహ్మణులు..

ప్రజాశక్తి - చింతలపూడి

45 సంవత్సరాలు దాటిన ప్రతీ నాయి బ్రాహ్మణ సోదరునికి పెన్షన్ మంజూరు చేయాలని నాయిబ్రాహ్మణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోప్పెర్ల నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి నాయి బ్రాహ్మణుల సమస్యలపై డిఆర్‌కి మెమోరండం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా ప్రతి బార్బర్ షాప్‌కి, అద్దె షాపులకు కూడా 150 యూనిట్లు కరెంటు ఉచితంగా అమలు పరచాలని, నాయి బ్రాహ్మణ కుల దూషణ కింద ఇచ్చిన జిఒ వెంటనే అమలు చేయాలని కోరారు. దేవస్థానాల కమిటీలో నాయి బ్రాహ్మణ మెంబర్ తప్పనిసరి అని జిఒ ఇచ్చారు. కానీ అమలు చేయడం లేదని తెలిపారు. కావున సదరు జిఒను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. నాయి బ్రాహ్మణులకు విద్యా, ఉద్యోగ రంగాలలో ఉన్న రిజర్వేషన్ మాదిరి రాజకీయ, స్థానిక సంస్థలలో కూడా ఎబిసిడి వర్గీకరణ జరగాలన్నారు. వాయిద్య కళాకారులు వాయిద్య పరికరాలను ట్రాన్స్‌ఫోర్ట్ చేసుకునే విధంగా ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోప్పక వెంకటేశ్వరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరావు, కైకలూరు, నూజివీడు అధ్యక్షులు విజయ్ కూమర్, దెందులూరు నియోజకవర్గ సాధికారిక కమిటీ సభ్యులు కొప్పెర్ల దావీదు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు.. ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని సీతానగరం ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గుంతలతో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. వర్షం వస్తే గుంతలు నిండిపోయి, కనిపించకపోవటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వర్షపు నీటితో గుంతలు నిండిపోయి చెరువును తలపిస్తున్నాయి. ఈ రోడ్డు వెంబడి తెలంగాణా రాష్ట్రానికి నిత్యం భారి వాహనాలు, ఫామాయిల్ ఫ్యాక్టరికీ ఫామాయిల్ లోడులతో లారీలు వెళ్తుంటాయి. ఈ గుంతలు చూసి వాహనదారులు భయభ్రాంతులకు గురౌవుతున్నారు. కనీసం గుంతలైనా పూడ్చమని వారు కోరుకుంటున్నారు.



గుంతలో చేరిన వర్షపు నీరు

భార్యను హత్య చేసిన భర్త

అనుమానాస్పద మృతిగా చిత్రీకరించేందుకు యత్నం

చిల్లబోయినపల్లిలో ఘటన

ప్రజాశక్తి - ముసునూరు



మృతి చెందిన ఓలేటి మణి

మండలంలో మహిళ దారుణంగా హత్య చేయబడిన సంఘటన సంచలనం సృష్టించింది. ముసునూరు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం... ముసునూరు మండలం చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన ఓలేటి రవీంద్ర భార్య ఓలేటి మణి(30) గురువారం మధ్యాహ్నం సమయంలో వరి పొలంలో కలుపు తీసేందుకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి భోజనం చేస్తున్న సమయంలో ఆమెను ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తలపై నరికి పారిపోయాడని, భర్త కేకలు వేస్తూ, చుట్టు పక్కల వారిని పిలవగా వారు వచ్చేసరికే ఆమె ప్రాణం పోయింది. ఆమెకు బలంగా దెబ్బలు తగలడంతో మృతి చెందింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తే హత్య చేసి వుంటాడని గ్రామస్తులు, ఇంటి పరిసర ప్రాంతాల వారు అనుమానిస్తున్నారు. మృతురాలికి ఇంటర్ చదివే కుమార్తె, 9వ తరగతి చదువుతున్న కుమారుడు కలరు. సమాచారం అందుకున్న నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు, ఎస్ఐ యం.కుటుంబరావు, సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్‌గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతురాలి భర్తను దర్యాప్తు చేయగా, అనుమానాస్పద మృతిగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేసే సమయంలో తన భర్తే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో బట్టబయలైంది. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు.

నూజివీడు నుంచి వేలంగినికి బస్సు

నూజివీడు రూరల్ : నూజివీడు ఆర్‌టిసి డిపో నుంచి వేలంగిని పుణ్యక్షేత్రానికి బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. నూజివీడు డిపోలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రయాణీకుల కోరిక మేరకు శనివారం, ఆదివారం కలిసి వచ్చేలా సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చెన్నై బీచ్, సెయింట్ థామస్ మౌంట్ దర్శనం చేసుకుని, వేలంగిని పుణ్యక్షేత్రం దర్శించి రావచ్చునని తెలియజేశారు.

విద్యార్థుల బస్సుపాసులకు నవభారత్ ఆర్థిక సహకారం

జంగారెడ్డిగూడెం : పరిసర ప్రాంత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వచ్చేందుకు ఫ్రీ బస్సు పాసుల నిమిత్తం స్థానిక నవభారత్ సంస్థ రూ.3లక్షల ఆర్థిక సహాయం అందించారని ఆర్‌టిసి డిపో మేనేజర్ పిపివి గంగాధర్ తెలిపారు. శుక్రవారం పేద విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి గాను ఫ్రీ పాసులు మంజూరు చేయు నిమిత్తం రూ.3 లక్షలను నవభారత్ సంస్థ ప్రతినిధులు చెక్కు రూపంలో అందజేశారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

జీలుగుమిల్లి : వార్డు ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆర్‌డిఒ ఎమ్.ఝాన్సీ రాణి పరిశీలించారు. శనివారం జరగనున్న ఉపఎన్నికల సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ జరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..

జంగారెడ్డిగూడెం : పట్టణంలో పలుచోట్ల వీధి రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం కురిసిన కొద్దిపాటి వర్షానికి పట్టణంలోని సౌభాగ్య థియేటర్ వెనుక వీధిలో రోడ్డుపై మురుగునీరు చేరి అధ్వానంగా తయారైంది. కనీసం నడిచేందుకు కూడా వీలు పడకుండా మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో సమీప నివాసులు, పాదాచారులు, తీవ్ర ఇబ్బంది గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి వీధి రోడ్లపై డ్రెయినేజీ మురుగునీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్పందన ఆర్జీపై విచారణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరు గ్రామంలో 2021లో గ్రామ బుక్ కీపర్ లలితకుమారి సూమారు రూ.7లక్షల లోన్ రికవరి నిధులు దుర్వినియోగం చేసిన విషయంపై అధికారులు శుక్రవారం గ్రామంలో విచారణ చేశారు. ఈసందర్భంగా అప్పటి విధుల్లో ఉన్న ఎంఎస్‌సిసి అమ్మాజీ, ఎపిఎం తిరుపతయ్య, విఒఎ లలితకుమారిని గ్రామ సమైఖ్య సంఘం సభ్యుల సమక్షంలో విచారణ నిర్వహించారు. అల్లూరు గ్రామ సంఘంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ స్పందనలో పెట్టిన ఆర్జీపై అధికారులు విచారణ నిర్వహించారు.